


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
12-02-2025
పేజీలు: 02



## పెండింగ్‌లో ఫైళ్లు లేకుండా క్లియర్ చెయ్యాలి

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆర్నెల్లైనా, ఏడాదైనా ఫైళ్లు క్లియర్ కాకపోవడం ఏమిటని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులపై ఆగ్రహించారు. బాధ్యత లేకుండా పనిచేస్తున్నారంటూ అధికారులపై తీవ్ర స్వరం వినిపించారు. ఈ - ఆఫీసులో ఫైళ్ల క్లియరెన్సు ప్రక్రియ వేగవంతం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సచివాలయంలో జరిగిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో భాగంగా వివిధ శాఖల్లో ఈ-ఆఫీసు ఫైళ్ల క్లియరెన్సు జరుగుతున్న క్రమం గురించి ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్ కుమార్ ప్రజంటేషన్ ఇచ్చారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో సగటున మూడు రోజుల్లోనే ఫైళ్లు క్లియర్ అవుతున్నాయని ఆర్టీజీఎస్ సీఈవో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని నిర్దేశించారు. ఆర్థికేతర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలనీ, ఆర్థిక అంశాలకు సంబంధించిన అంశాలపైనా అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని ఆదేశించారు. అటవీశాఖ ప్రగతిపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ సమయంలో గాలి నాణ్యతపై చర్చ జరిగింది. 'రాష్ట్రంలోని వివిధ నగరాల్లో గాలి నాణ్యత ఎలా ఉంది? దేశంలోని ఇతర నగరాల్లో ఎయిర్ క్వాలిటీ ఎలా ఉంది?.' అని సీఎం ప్రశ్నించారు. అనంతరాము వద్ద సమాచారం లేకపోవడంతో ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు.



## కొన్నాళ్లు చికెన్ తినకండి..

తెలంగాణ ప్రభుత్వం హెచ్చరికలు

తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ కలకలం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని రోజుల పాటు చికెన్ తినవద్దని.. కోళ్లకు సోకుతున్న వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం సూచనలు చేసింది. ఇదే సమయంలో బర్డ్ ఫ్లూ వచ్చిన కోళ్లను తాకవద్దని జాగ్రత్తలు పాటించాలని వార్నింగ్ ఇచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ వణికిస్తోంది. బర్డ్ ఫ్లూ భయంతో ఇప్పటికే చికెన్ అమ్మకాలు భారీ పడిపోయాయి. ఇదే సమయంలో చికెన్ రేట్లు కూడా తగ్గిపోయాయి. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. కొన్ని రోజులు చికెన్ తినవద్దని ప్రజలను హెచ్చరించింది. ఈ క్రమంలో కోళ్లకు సోకుతున్న వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచనలు చేసింది. తగు జాగ్రత్తలు తీసుకోవాలని అలర్ట్ చేసింది. మరోవైపు.. ఏపీ నుంచి కోళ్లతో వస్తున్న వాహనాలను అధికారులు వెనక్కి తిప్పి పంపుతున్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో పశుసంవర్ధకశాఖ చెక్ పోస్టులు ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 24 చెక్ పోస్టులను ప్రారంభించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేయగా.. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల్లో ఎనిమిది, ఖమ్మం, ములుగు, సంగారెడ్డి జిల్లాల్లో మరో 21 చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో ఇతర రాష్ట్రాల కోళ్లు, గుడ్ల వాహనాలను అడ్డుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. బర్డ్ ఫ్లూ వ్యాప్తిపై హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాటు చేశారు అధికారులు. హైదరాబాద్‌లోని పశుసంవర్ధకశాఖ డైరెక్టరేట్లో 040-23314876 నంబర్ కాల్ చేయాలని సూచించారు. కోళ్లలో అసాధారణ మరణాలు, ఏమైనా వ్యాధి లక్షణాలుంటే ఈ హెల్ప్ లైన్‌లకు సమాచారం ఇవ్వాలని జిల్లాల పశువైద్యాధికారులకు తెలిపారు. ఇక, బర్డ్ ఫ్లూ కారణంగా తెలుగు రాష్ట్రాల్లో పౌల్ట్రీ వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాతపడుతున్న నేపథ్యంలో భారీ నష్టాలు వచ్చాయని ఆవేదన చెందుతున్నారు.


చెక్‌పోస్టులు ఇలా..

ఏపీ నుంచి తెలంగాణలోకి కోళ్లు రాకుండా అడ్డుకునేందుకు రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్ వద్ద విజయవాడ — హైదరాబాద్ జాతీయ రహదారిపై చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి ఏపీ వైపు నుంచి కోళ్లతో వస్తున్న డీసీఎంను వెనక్కి పంపినట్టు కోదాడ మండల పశువైద్యాధికారి మధు తెలిపారు. ఖమ్మం జిల్లా సరిహద్దుగా ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏపీ—ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేస్తూ కోళ్ల దిగుమతి కాకుండా అడ్డుకుంటున్నారు. ఏపీ సరిహద్దుల్లో ఉన్న కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు, పోలీసు, రెవెన్యూ, ఫారెస్ట్ తదితర శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహిస్తున్నామని ఖమ్మం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వి.వెంకటనారాయణ, వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాకు మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న సాలూర, కందకుర్తిచెక్ పోస్టుల వద్ద పశుసంవర్ధక, పోలీసు శాఖలు కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి నిజామాబాద్‌లోకి కోళ్లతో పాటు ఏ జీవాలను కూడా రవాణా చేయకుండా నిరోధిస్తున్నారు.



## పులివెందుల మున్సిపాలిటీపై టీడీపీ కన్ను

మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయకోట పులివెందుల మున్సిపాలిటీపై తెలుగుదేశం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే జగన్‌కు చెక్ పెట్టేలా టీడీపీ పావులు కదుపుతోంది. ఏపీలో ఇప్పటికే పలు మున్సిపాలిటీల్లో పసుపు జెండా రెపరెపలాడింది. పులివెందులలో కూడా జగన్‌ను ఢీకొట్టేలా టీడీపీ మాస్టర్ ప్లాన్ వేసింది. అనుకున్నదే తడవుగా ప్రజల్లో బలం ఉన్న నేతలను టీడీపీలో చేర్చుకోవడానికి స్థానిక కేడర్ సిద్ధమవుతున్నారు. పులివెందుల టీడీపీ నేతలు కూడా స్థానికంగా ఉన్న పరిస్థితులను హై కమాండ్‌కు వివరిస్తున్నారు. పులివెందుల మున్సిపాలిటీలోని 30 వార్డు వైసీపీ కౌన్సిలర్ షాహిదాతో పాటు 20 కుటుంబాలు ఇవాళ(బుధవారం) టీడీపీలో చేరాయి. వీరితో పాటు పులివెందుల నుంచి భారీ సంఖ్యలో నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరడానికి సిద్ధమవుతున్నారు.



## అయోధ్య రామాలయ ప్రధాన పూజారి కన్నుమూత

అయోధ్య రామాలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 85 ఏళ్లు. ఫిబ్రవరి 3వ తేదీన ఆయన అనారోగ్యంబారిన పడటంతో లఖ్‌నవూలోని సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో చేర్పించారు. సత్యేంద్ర దాస్ మధుమేహం, బీపీతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరినట్లు వైద్యులు తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఇవాళ తుది శ్వాస విడిచినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాగా, 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేసిన సమయంలోనూ సత్యేంద్రదాస్ తాత్కాలిక రామమందిరానికి పూజారిగా ఉన్న విషయం తెలిసిందే. 20 ఏళ్ల వయసులోనే నిర్వాణి అఖాడాలో చేరారు.



## శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

తిరుమలలో భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనం కోసం వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. ఇక టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. నిన్న 67,192 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 20,825 మంది తలనీలాలు సమర్పించారు. నిన్న హుండీ ఆదాయం రూ.4.15 కోట్లు వచ్చిందని టీటీడీ తెలిపింది.

## మియాపూర్‌లో జాతీయ రహదారిపై ఆక్రమణల తొలగింపు

హైదరాబాద్‌లో రహదారులపై ఆక్రమణల తొలగింపు ముమ్మరంగా సాగుతున్నది. ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఫుట్‌పాత్‌లపై, రహదారులకు ఇరువైపుల వెలసిన దుకాణాలు, తోపుడు బండ్లను అధికారులు తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా చందానగర్ సర్కిల్ పరిధిలోని జాతీయ రహదారికి ఇరువైపుల ఆక్రమణలను పోలీసులు తొలగించారు. మరో వారం రోజులపాటు ఆక్రమణ తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసు విభాగాల బందోబస్తుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లింగంపల్లి చౌరస్తాలో నిర్మించిన ఫ్లైఓవర్ త్వరలో ప్రారంభోత్సవం కానున్న నేపథ్యంలో రహదారి ఆక్రమణ తొలగింపును అధికారులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఈ ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేయనున్నారు. సర్కిల్ పరిధిలోని మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు ఆక్రమణల తొలగింపు వారం రోజులపాటు కొనసాగించనున్నట్లు చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు.





## రెండెకరాల వరకు రైతు భరోసా జమ


రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయంగా అమలుచేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా మంగళవారం నాటికి రెండెకరాల భూమి కలిగిన రైతుల ఖాతాల్లో నగదు జమ అయింది. ఖమ్మం జిల్లాలో రైతు భరోసాకు 3, 51, 592 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. వీరికి సాగు భూమి ఆధారంగా రూ. 371. 06 కోట్లు జమ చేయాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు 1, 63, 119 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ. 104, 74, 31, 487 జమ అయ్యాయని అధికారులు వెల్లడించారు.

## గాలి, ధ్వని కాలుష్యంపై సర్వే చెయ్యండి

అన్న క్యాంటీన్లకు సమాజంలో సలహా కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణలో దాతలను ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు సూచించారు. మంగళవారం జరిగిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ దాతలు నేరుగా వచ్చి అన్న క్యాంటీన్‌లో వడ్డించడం లేదా వాళ్ల పేరుపై ప్రభుత్వ కార్యక్రమం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరాలు, పట్టణాల్లో పబ్లిక్ టాయిలెట్లను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ శాఖకు స్పష్టం చేశారు. విజయవాడలోని పబ్లిక్ టాయ్‌లెట్లు పాడయ్యాయని, నిర్వహణను కొత్త ఏజెన్సీలకు ఇవ్వాలన్నారు. గాలి కాలుష్యంలో విజయవాడ 6వ, విశాఖపట్నం 28వ స్థానంలో ఉందని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఈ సందర్భంగా ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో గాలి, ధ్వని కాలుష్యంపై సర్వే చేయాలని సీఎం ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ కింద 2028 నాటికి ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వాలని స్పష్టం చేశారు.

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలపై ఫోకస్.. నేడు కీలక సమావేశం

అటు సర్కార్ ఇటు స్టేట్ ఎలక్షన్ కమిషన్ తెలంగాణలో పంచాయతీ ఎన్నికలపై ఫోకస్ పెంచాయి. నేడు రాజకీయ పార్టీలతో తెలంగాణ ఎన్నికల సంఘం సమావేశం కానుంది. ఏకగ్రీవ ప్రక్రియ లేకుండా ఎన్నికల నిర్వహణ పై ఆయా పార్టీలతో SEC సమావేశంలో చర్చించనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటా అంశంతో పాటు ఎన్నికల నిర్వహణపై ఆయా పార్టీల అభిప్రాయం తీసుకోనుంది. అటు పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ల తుదిజాబితా ఖరారుపై చర్చించనుంది. త్వరలో జరిగే స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలు ఉంటాయా లేదా అనే దానిపై ఇవాళ కాస్త క్లారిటీ రానుంది. ఒకే ఒక్క నామినేషన్ దాఖలైన పరిస్థితుల్లో అక్కడ నోటా కూడా ఉంటుంది. అభ్యర్థికి ఓటు వేయడం ఇష్టం లేకపోతే.. ఓటర్లు నోటా బటన్ నొక్కొచ్చు. అంతే తప్ప ఏకగ్రీవాలు ఉండవనే దానిపై చర్చించబోతున్నారు. దీనిపై ఇవాళ నిర్ణయం తీసుకుంటారా.. ఏం జరుగుతుంది అనేది ఆసక్తికరంగా మారింది. స్థానిక సంస్థల్లో సాధారణంగా ఏకగ్రీవాల హడావుడి కనిపిస్తుంటుంది. వార్డుమెంబర్లు, సర్పంచ్ పదవులు- ఇలా చాలా చోట్ల ఏకగ్రీవాలు అవుతుంటాయి. ఇవన్నీ వేలంపాట తరహాలోనే ఉంటున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలోనే.. ఇప్పుడీ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. మరోవైపు నేడు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఈసీ సమావేశం కానుంది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై MCHRDలో కలెక్టర్లకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనుంది. నాలుగు రోజుల్లో రిజర్వేషన్లు ఫైనల్ చేసే యోచనలో ఉంది సర్కార్. ఇందుకు పంచాయతీరాజ్ అధికారు కసరత్తు చేస్తున్నాయి. న్యాయ వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.





### నేటి నుండి నాలుగు రోజులపాటు
# మేడారం మినీ జాతర

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని వనదేవతలు సమ్మక్క సారలమ్మ మినీ జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. మహాజాతర నిర్వహించిన మరుసటి సంవత్సరం మినీ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లను దర్శించుకునేందుకు భారీగా తరలివస్తున్నారు భక్తులు. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన జాతరలో సమ్మక్క- సారలమ్మ జాతర ఒకటి . ఆదివాసీ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన సమ్మక్క - సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు లక్షల సంఖ్యలో వస్తారు. అమ్మవార్లకు బెల్లాన్ని(బంగారాన్ని) సమర్పిస్తే తమ కష్టాలన్నీ తొలగిపోతాయని ప్రజల నమ్మకం.అమ్మవార్ల గద్దెల దగ్గర ఉన్న బెల్లాన్ని చిటికెడు తీసుకెళ్లినా చాలు.. ఆ బెల్లమే తల్లుల దీవెనగా భావిస్తారు. అందుకే అమ్మవార్లకు కిలోల కొద్దీ బంగారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు భక్తులు.

**మేడారం చిన్న జాతర.. 200 ప్రత్యేక బస్సులు**

ములుగు జిల్లాలోని మేడారంలో సమ్మక్క, సారలమ్మ చిన్న జాతర ప్రారంభమైంది. రూ.5.30కోట్లతో ప్రభుత్వం జాతరకు ఏర్పాట్లు చేసింది. మేడారం వెళ్లే భక్తుల కోసం 200 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ వెల్లడించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తుండడంతో, వెయ్యిమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జంపన్నవాగు వద్ద జల్లు స్నానాలు, దుస్తులు మార్చుకునేందుకు గదుల ఏర్పాటు చేశారు.




# బంగ్లా క్రికెటర్‌పై ఐదేళ్ల నిషేధం

బంగ్లాదేశ్ మహిళా క్రికెటర్ షొహేలీ (34) అక్తర్‌పై ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఐదేళ్ల నిషేధం విధించింది. అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి ఆమె ఐదేళ్ల పాటు దూరంగా ఉండాలని ఐసీసీ ఆదేశించింది. ఫిక్సింగ్ ఆరోపణలు నిజమని తేలడంతో ఐసీసీ యాంటీ కరప్షన్ కోడ్ కింద చర్యలు తీసుకున్నట్లు మంగళవారం ప్రకటన విడుదల చేసింది. 2023లో సౌతాఫ్రికా వేదికగా జరిగిన మహిళా టీ20 వరల్డ్ కప్‌లో ఆడిన షొహేలీ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. 2023లో జమునా టీవీలో ఇద్దరు క్రికెటర్లు మాట్లాడుకున్న ఆడియో క్లిప్ ప్రసారం అయ్యింది. వరల్డ్ కప్ జరిగే సమయంలో షొహేలీ అక్తర్‌ను బంగ్లాదేశీ క్రికెట్ లతా మొండల్ కలిసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను అప్పట్లో షొహేలీ ఖండించింది. తాను సోషల్ మీడియాలో ఒక ఫ్రెండ్‌తో కనెక్ట్ అయ్యాను. ఆ సమయంలో వాడి వేడి వాదోపవాదాలు జరిగాయి. దీంతో ఈ విషయాలను బంగ్లాదేశ్ టీమ్ మేట్స్‌తో పంచుకున్నాను. కానీ వాళ్లు బీసీబీ యాంటీ కరప్షన్ యూనిట్‌కు తెలియజేశారని షొహేలీ అక్తర్ చెబుతోంది. 2023 ఫిబ్రవరి 14న ఆస్ట్రేలియాతో మ్యాచ్‌కు ముందు ఆమె ఫిక్సింగ్‌లో ఇన్వాల్వ్ అయినట్లు ఐసీసీ గుర్తించింది. సోషల్ మీడియాలో ఒక బంగ్లా క్రికెటర్‌ను ఫిక్సింగ్ చేయమని ప్రోత్సహించినట్లు తెలిసింది.



# 'లైలా' సెన్సార్ అండ్ రన్‌టైమ్ వివరాలు

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'లైలా' ఫిబ్రవరి 14న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు రామ్ నారాయణ్ డైరెక్ట్ చేయగా పూర్తి రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుంది. ఇక ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ సినిమాపై పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేశాయి. కాగా, ఈ సినిమా సెన్సార్ పనులు కూడా ముగించుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. ఇందులో బోల్డ్ డైలాగ్స్, కొన్ని సీన్స్ కారణంగా ఈ సినిమాకి ఏ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్‌ను 2 గంటల 16 నిమిషాలుగా ఫిక్స్ చేశారు మేకర్స్. క్రిస్పీ రన్‌టైమ్‌తో రానున్న ఈ సినిమా యూత్ ఆడియన్స్‌ను ఆకట్టుకోవడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇక ఈ సినిమాలో విశ్వక్ సేన్ తొలిసారి లేడీ గెటప్‌లో నటిస్తున్నాడు.


### మరోసారి ఆర్టీసీ బస్సులో 'తండేల్'..
# వివరాలు షేర్ చేసిన నిర్మాత



నాగచైతన్య కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన తండేల్ సినిమాను పైరసీ వెంటాడుతూనే ఉంది. ఇప్పటికే నిర్మాతలు బన్నీ వాసు, అల్లు అరవింద్ చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేశారు. కొద్దిరోజుల క్రితమే పలాస నుంచి విజయవాడ వెళ్లిన ఆర్టీసీ బస్సులో ఈ సినిమాను ప్రదర్శించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో చిత్ర యూనిట్ ఫైర్ అయింది. అయితే, తాజాగా మరోసారి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులోనే ఈ సినిమాను ప్రదర్శించడంతో ఆ వార్త నెట్టింట వైరల్ అయింది. దీనిపై నిర్మాత బన్నీ వాసు తన సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఫిబ్రవరి 11న విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్లే బస్సులో తండేల్ సినిమాను ప్రదర్శించినట్లు బన్నీ వాసు తెలిపారు. ఆ బస్సుకు సంబంధించిన వివరాలు (AP 39 WB. 5566) షేర్ చేశారు. రెండోసారి ఏపీఎస్ ఆర్టీసీలోనే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడంతో అక్కినేని ఫ్యాన్స్ కూడా ఫైర్ అవుతున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని బన్నీ వాసు కోరారు. 'మా సినిమా పైరసీని రెండోసారి ప్రదర్శించారు.


# కూటమి ప్రభుత్వంపై
# వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల ఫైర్

ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధికార ప్రతినిధి ఆరె శ్యామల మండిపడ్డారు. తిరుపతికి చెందిన జనసేన నాయకుడు కిరణ్ రాయల్ లక్ష్యంగా శ్యామల ఘాటుగా విమర్శలు గుప్పిస్తూ.. నేరుగా తన విమర్శల పదును పవన్ వైపు మళ్లించారు. అధికారంలోకి రాకముందు పవన్ ఎన్నో మాటలు చెప్పారని, ఇప్పుడు సైలెంట్ అయ్యారని శ్యామల విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు.తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శ్యామల మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి జనసేన నాయకుడు కిరణ్ రాయల్ మోసం చేశారంటూ లక్ష్మి అనే మహిళ కన్నీటితో విలపిస్తుంటే కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. లక్ష్మి నుంచి తీసుకున్న డబ్బుతోనే కిరణ్ రాయల్ జనసేన సభలను నిర్వహించడం వల్లే జనసేన నాయకత్వం ఈ విషయంలో అతడికి అండగా నిలుస్తోందని ఆరోపించారు. ఈ రాష్ట్రంలో ఆడబిడ్డల జోలికి వస్తే తాట తీస్తానన్న వారు ఎక్కడున్నారని నిలదీశారు. "ఆడపిల్లల జోలికొస్తే తొక్కిపెట్టి నార తీస్తాం... నడుం వంచి




దెబ్బలు కొడతాం అన్న పవన్ కల్యాణ్... ఏది ఇప్పుడేం అయింది... ఇప్పుడు తొక్క లేదు... నార లేదు..." అని శ్యామల విమర్శలు గుప్పించారు. "కిరణ్ రాయల్ వల్ల తనకు అన్యాయం జరిగిందని లక్ష్మి అనే మహిళ కన్నీటితో న్యాయం కోసం కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంది. మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా తాను అక్కడ ఉంటాను అని చాటుకునే డిప్యూటీ సీఎం తమ పార్టీ నాయకుడు చేసిన అన్యాయంపై స్పందిస్తారని ఆశ పెట్టుకుంది. ఆమెకు న్యాయం జరగకపోగా కిరణ్ రాయల్ తన పలుకుబడిని ఉపయోగించి జైపూర్ నుంచి పోలీసులను దింపి బాధిత మహిళను జైలుకు పంపడం విస్మయం కలిగిస్తోంది. అసలు ఈ రాష్ట్రంలో మహిళలకు భద్రత ఉందా అనే సందేహాలు కలుగుతున్నాయి. కోటిరూపాయలకు పైగా నగదు, బంగారంను తీసుకుని జనసేన పార్టీ కార్యకలాపాలను కిరణ్ రాయల్ వినియోగించారని.. తాను జనసేన నుంచి పోటీ చేసి గెలుస్తాను, తిరిగి ఆ సొమ్మును చెల్లిస్తానంటూ బాధిత లక్ష్మిని నమ్మించి మోసం చేసిన వైనంను బాధితురాలు కన్నీటితో మీడియా ముందు వెల్లడించడం రాష్ట్ర ప్రజలు చూశారు. ఎన్నిసార్లు తన సొమ్ము కోసం అడిగినా కిరణ్ రాయల్ స్పందించకపోగా, బాధితురాలిపైనే దౌర్జన్యం చేయడంతో దిక్కులేక న్యాయం కోసం పోలీసులను లక్ష్మి ఆశ్రయించింది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నందునే కిరణ్ రాయల్ పై కనీసం పోలీసులు ఫిర్యాదు కూడా తీసుకునేందుకు నిరాకరించారు. ఇదేనా కూటమి పాలనలో బాధితులకు జరిగే న్యాయం? ఆడబిడ్డలకు అండగా ఉంటాను అంటూ ఆవేశంతో ప్రసంగాలు చేసిన వారు తనకు న్యాయం చేస్తారని నమ్మిన లక్ష్మి మీడియా ద్వారా జరిగిన విషయాన్ని వెల్లడిస్తే, ఆమెకు న్యాయం చేయకపోగా ఏకంగా జైలుకు పంపినా ఎందకు మౌనంగా ఉన్నారు?" అని శ్యామల ప్రశ్నించారు.

### సీఐడీ విచారణలో న్యాయవాది
# గూడపాటి లక్ష్మీనారాయణ




సీఐడీ మాజీ చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై సీఐడీ విచారణ మొదలైంది. ఆయన సీఐడీ అధికారిగా ఉన్న సమయంలో పలువురిని అర్ధరాత్రి అరెస్టు చేయడమే కాకుండా థర్డ్‌డిగ్రీ ప్రయోగించారంటూ న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ చేసిన ఫిర్యాదుపై విచారణ మొదలైంది. మంగళవారమిక్కడ న్యాయస్థానాల ప్రాంగణంలో లక్ష్మీనారాయణ వాంగ్మూలాన్ని సీఐడీ అధికారులు నమోదు చేశారు. అనంతరం టీడీపీ మీడియా సెల్ ఇన్‌చార్జి దారపనేని నరేంద్ర, టీడీపీ సోషల్ మీడియా నేత గార్లపాటి వెంకటేశ్వరరావు అలియాస్ వెంకటేశ్, సీనియర్ జర్నలిస్టు కొల్లి అంకబాబు నుంచీ వాంగ్మూలం తీసుకున్నారు. సీఐడీ డీజీగా సునీల్‌కుమార్ ఉన్నకాలంలో పలువురు టీడీపీ కార్యకర్తలను అర్ధరాత్రి అరెస్టు చేయడమే కాకుండా నిబంధనలను అతిక్రమించి కస్టడీలో వారిపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించారని లక్ష్మీనారాయణ అప్పట్లో కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశారు.



# 'శారీ' ట్రైలర్

టాలీవుడ్ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ సమర్పణలో వస్తున్న తాజా చిత్రం శారీ నుంచి ట్రైలర్ వచ్చేసింది. ఈ సినిమాలో కోలీవుడ్ భామ ఆరాధ్యదేవి లీడ్ రోల్ పోషిస్తోంది. కేవలం ఆమె ఫోటోతోనే సినిమాపై అంచనాలు పెంచేసిన వర్మ.. తాజాగా ట్రైలర్‌తో మరింత బజ్ క్రియేట్ చేశారు. ఒక వ్యక్తిపై ప్రేమ మరీ ఎక్కువైతే ఎలాంటి అనర్థాలు జరుగుతాయి అనే స్టోరీతో ఈ మూవీ తీశారు. పాన్ ఇండియా రేంజ్‌లో ఫిబ్రవరి 28న తెలుగు, హిందీ, తమిళ, మళయాళ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. ఆర్జీవీ ఆర్వీ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ప్రముఖ బిజినెస్‌మాన్ రవి వర్మ నిర్మిస్తున్నారు. పలు నిజజీవిత సంఘటనల ఆధారంగా సైకలాజికల్ థ్రిల్లర్‌గా 'శారీ' తీశారు. గిరీశ్ కృష్ణ కమల్ దర్శకత్వం వహించారు.

### ఫీజు చెల్లించలేదని మందలించిన ప్రిన్సిపల్..
# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఫీజు చెల్లించలేదని ప్రిన్సిపల్ మందలించడంతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మేడ్చల్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో అఖిల (16) పదో తరగతి చదువుతున్నది. సోమవారం స్కూల్‌కి వెళ్లిన అఖిలను.. ఫీజు చెల్లించలేదని తోటి విద్యార్థుల ముందు ప్రిన్సిపల్ మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని మంగళవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కాపాడారు. అయితే తీవ్ర అస్వస్థతకు గురవడంతో యశోద దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.



# బాలీవుడ్‌లో బంపరాఫర్

'పుష్ప-2'లో ఐటెంసాంగ్ 'కిస్సిక్' కథానాయిక శ్రీలీల జాతకాన్నే మార్చివేసింది. ముఖ్యంగా ఈ పాటతో ఉత్తరాది యువతరంలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుందీ అమ్మడు. దీంతో బాలీవుడ్ వరుస అవకాశాలు వరిస్తున్నాయి. ఇప్పటికే యువహీరో ఇబ్రహిమ్ అలీఖాన్ సరసన ఓ చిత్రంలో నాయికగా నటిస్తున్నది శ్రీలీల. ఆమెకిది తొలి హిందీ చిత్రం. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో భారీ ఆఫర్‌ను దక్కించుకుంది. అగ్ర హీరో కార్తిక్ ఆర్యన్ సరసన కథానాయికగా నటించనుంది. అనురాగ్‌బసు దర్శకత్వం వహిస్తారు. తొలుత త్రిప్తి డిమ్రీని కథానాయికగా ఎంపిక చేయగా..చివరి నిమిషంలో ఆమెను తప్పించి శ్రీలీలను ఖరారు చేశారు. మార్చిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. 'ఆషికీ-3'లో అవకాశం రావడం పట్ల శ్రీలీల ఆనందం వ్యక్తం చేసింది. బాలీవుడ్‌లో తన కెరీర్‌కు బ్రేక్‌నిచ్చే చిత్రమవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

